ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
మంగళవారం 30 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.109	131	190
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.6

యాదగిరి క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ



- రెండు నెలల్లో వరుస వార్షిక మహోత్సవాలు
- పాతగుట్టలో వచ్చే నెల 15 నుంచి అధ్యయనోత్సవాలు
- 19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- మార్చి 5 నుంచి శివరాత్రి మహోత్సవాలు
- 11 నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, జనవరి 29: రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి రాబోయే రెండు నెలల్లో వరుస వార్షిక మహోత్సవాలకు వేదిక కానుంది. వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో పాతగుట్ట, యాదగిరికొండపై స్వయంభు పాంచనారసింహుల వార్షిక బ్రహ్మోత్సవాలు, కొండపైన అనుబంధ శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు కొనసాగనున్నాయి. వచ్చే నెల (ఫిబ్రవరి) 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పాత గుట్ట లక్ష్మీనృసింహుడి దేవాలయంలో నాలుగు రోజుల పాటు వార్షిక అధ్యయనోత్సవాలు, 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పాతగుట్ట ఆలయంలో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు, మార్చి 5నుంచి 10 వరకు శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు, మార్చి 11 నుంచి 21 వరకు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, స్వయంభు పాంచ నారసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతీ సంవత్సరం ఈ వరుస వేడుకలను దేవస్థాన అధికారులు అంగరంగ వైభవంగా, శోభాయమానంగా, నయనానందకరంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

పాతగుట్టలో ఫిబ్రవరి 19 నుంచి అధ్యయనోత్సవాలు


గుట్ట దేవస్థాన అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 18 వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, 19 నుంచి 23 వరకు వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతీ సంవత్సరం పాతగుట్ట దేవాలయంలో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు ముందుగా ఆలయ ప్రాశస్త్యం మరింత ఇనుమడింపజేసేందుకు అధ్యయనోత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. అధ్యయనోత్సవాల్లో లక్ష్మీనృసింహుడు వివిధ వాహన సేవల్లో దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేస్తాడు. ఫిబ్రవరి 19న పాంచహ్నిక దీక్షలో స్వస్తి పుణ్యాహవాచనంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం పలుకుతారు. ఫిబ్రవరి 20న ధ్వజారోహణం, ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించే ఘట్టం దేవతాహ్వానం, 21న ఎదుర్కోలు మహోత్సవం, 22న తిరుకల్యాణోత్సవం, 23న దివ్యవిమాన రథోత్సవం, 24న మహాపూర్ణాహుతి, శ్రీచక్రతీర్థ స్నానం, 25న అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మార్చి 5 నుంచి శివరాత్రి మహోత్సవాలు

యాదగిరికొండపైన అనుబంధ శివాలయంలో మార్చి 5వ తేదీ నుంచి 10 వరకు శివరాత్రి మహోత్సవాలు శైవాగమ పద్ధతిలో ఆరంభించనున్నారు. 5న ఉదయం విఘ్నేశ్వరుడికి తొలి పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 6న ధ్వజారోహణం, 7న శివపార్వతుల కల్యాణోత్సవం, 8న మహా శివరాత్రి వేడుకలు, 9న లక్షబిల్వార్చనలు, 10న మహాపూర్ణాహుతితో ఈ మహోత్సవాలు ముగుస్తాయి.

మార్చి 11 నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

ఆర్తత్రాణపరాయణుడు, ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మార్చి 11వ తేదీ నుంచి 21 వరకు నవాహ్నిక దీక్షలో శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు నుంచి అలంకార సేవలు, ధార్మిక, సాహిత్య, సంగీత మహా సభలు కొనసాగనున్నాయి. యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో ప్రతీ వేడుక, ప్రతీ ఘట్టం దర్శనీయమే. ఈ విశేష పర్వదినాల్లో క్షేత్రాన్ని సందర్శించి తిరువీధి సేవలను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించేందుకు భక్తులు కుటుంబసమేతంగా అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు సైతం ఏర్పాట్లు చేయనున్నారు.



తిరు కల్యాణ బ్రహ్మోత్సవ పర్వాలు..

- 11వ తేదీన ఉదయం ప్రధానాలయ ముఖమండపంలో స్వస్తి పుణ్యాహవాచనం, రాత్రికి అంకురారోపణం.
- 12న ధ్వజారోహణం, వేదపారాయణాలు, సాయంత్రం దేవతాహ్వానం.
- 13 నుంచి 16వ తేదీ అలంకార సేవలు, ధార్మిక సభలు
- 17న రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం
- 18న రాత్రి జగద్కల్యాణకారకుడి తిరుకల్యాణోత్సవం.
- 19న రాత్రి కల్యాణ లక్ష్మీనృసింహుల దివ్యవిమాన రథోత్సవం.
- 20న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, రాత్రి డోలోత్సవం.
- 21న అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి.

రెండు రోజులకో దొంగతనం

వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు నెలల కాలంలో 38 చోరీలు జరిగాయి. జిల్లాలో రెండు నెలల్లో సరాసరిగా రెండు రోజులకు ఒకటి చొప్పున చోరీలు జరగ్గా, రూ.70 లక్షల సొత్తు అపహరణకు గురైంది. దీంతో తాళం వేసి ఎక్కడికి వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోంది. తాజాగా జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌కాలనీలో జలగం కళమ్మ శనివారం రాత్రి తాళం వేసి స్థానిక బంధువుల ఇంటికి వెళ్లింది. వచ్చి చూసే సరికి చోరీ జరిగింది. సుమారు రూ.లక్ష విలువైన వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా చైన్‌స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి.

- 60 రోజుల్లో 38 చోరీలు
- రూ.70 లక్షల సొత్తు అపహరణ
- చోద్యం చూస్తున్న పోలీసులు
- పనిచేయని సీసీ కెమెరాలు



● సూర్యాపేటక్రైం

జిల్లాలోని అన్నిప్రాంతాల్లోనూ చోరీలు మామూలయ్యాయి. కోదాడ, నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌లలో పలు నివాసాల్లో చోరీలు జరిగి లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంతనగదు అపహరణకు గురైంది. గతేడాది డిసెంబరు 1 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 38 చోరీలు జరగగా సుమారు రూ.70లక్షల మేర సొమ్ము అపహరణకు గురైంది. జిల్లా కేంద్రంలోని అంజనాపురి కాలనీలోని ఓ ఇంట్లో జరిగిన చోరీలో సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. అదేవిధంగా శ్రీశ్రీనగర్‌కాలనీ, క్రిష్ణానగర్ కాలనీలోని మూడు నివాసాల్లో ఒకే రోజు దొంగలు పడ్డారు. వీటితో పాటు శ్రీరాంనగర్‌కాలనీ, విద్యానగర్‌లో కూడా తాళం వేసి ఉన్న నివాసాల్లో చోరీలు జరిగాయి. వీటితో పాటు పెన్‌పహాడ్, మేళ్లచెర్వు, చివ్వెంల, కోదాడ పట్టణం, హుజూర్‌నగర్, తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల పరిధిలో ఇటీవల చోరీలు జరిగాయి. ఆయా చోరీలకు సంబంధించి పోలీసులు ఎవరినీ పట్టుకోలేదు. గతేడాది డిసెంబరులో జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ న్యాయవాది నివాసంలో దొంగలు చోరీకి పాల్పడి ఇంట్లోని సుమారు రూ.4లక్షల నగదు, ఆరు వేల అమెరికా డాలర్లు, పది తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీలోని ఉపాధ్యాయుడి నివాసంలో దొంగలు సుమారు రూ.10 లక్షల విలువ చేసే 17తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా వజ్ర టౌన్‌షిప్‌లో జరిగిన చోరీలో సుమారు 5తులాల వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఇలా జిల్లాలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట చోరీ జరుగుతూనే ఉంది.



శనివారం సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌కాలనీలోని జలగం కళమ్మ ఇంట్లోని బీరువాని వస్తువులను చిందరవందర చేసిన దొంగలు

ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే భయం

జిల్లాలో ప్రజలు ఇంటికి తాళం వేసి పనినిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇతర ప్రాంతం నుంచి ఇంటికి వచ్చేలోపు చోరీ జరుగుతోంది. కొంతమంది చోరీలకు భయపడి వివిధ బ్యాంకుల్లో డబ్బులు వెచ్చించి లాకర్లు తీసుకుని విలువైన ఆభరణాలను భద్రపర్చుకుంటున్నారు.

పోలీసు నిఘా కరువు

పోలీసుల నిర్లక్ష్య వైఖరి దొంగతనాలకు ఆస్కారం ఇస్తుందన్న ఆరోపణలుఉన్నాయి. చోరీలకు సంబంధించి కొన్నిచోట్ల ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. అంతేకాక కేసు కూడా నమోదుచేయడం లేదని తెలుస్తోంది. ఇదే సమయంలో బాధితులను వివిధరకాల ప్రశ్నలు వేసి ఫిర్యాదు చేయకుండా చేస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. గతేడాది శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఎక్కువగా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపైనే ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో చోరీలు విపరీతంగా పెరిగాయి. విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న పోలీసులు చోరీలకు పాల్పడిన వారిని పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. నిత్యం ఉదయం, రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేయాల్సి ఉంది. కానీ వివిధ రకాల విధులు, సిబ్బంది కొరత కారణంగా పెట్రోలింగ్ సరిగా చేయడం లేదు. పలువురు పోలీస్ అధికారులు పోలీస్‌స్టేషన్లలో తక్కువ సమయం కేటాయిస్తూ వారి సొంత పనులకు సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 3,500 సీసీటీవీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. వీటిలో కొన్ని మరమ్మతుకు గురైతే వాటిని పట్టించుకోవడం లేదు. సీసీటీవీ కెమెరాలు పనిచేస్తే నేరాల ఛేదన సులభమవుతోంది. ఇదిలా ఉండగా చోరీలను అరికట్టడానికి ఎస్పీ రాహుల్‌హెగ్డే జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. చోరీలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, జరిగిన చోరీ కేసులను త్వరగా ఛేదించాలని ఆదేశించారు.

దొంగలను పట్టుకుంటాం



చోరీలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటాం. దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానితుల వివరాలు విధిగా పోలీసులకు అందించాలి.సీసీటీవీ కెమెరాలు పనిచేసేటట్లు చూస్తాం. చోరీకి గురైన సొమ్మును తిరిగి రాబడతాం. అవసరమైన చోట్ల సిబ్బందిని నియమిస్తాం. పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం.

● రాహుల్ హెగ్డే, ఎస్పీ

గమ్యానికి చేరువలో..

మృత్యు ఒడిలోకి

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత
- ఛిద్రమైన రెండు కుటుంబాలు



మిర్యాలగూడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన మచ్చేందర్, మాధవి, లియాన్ష్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుంభం

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: ఇష్టదైవాన్ని దర్శించుకోవాలని రెండు కుటుంబాలు పుణ్యక్షేత్రాలకు బయలుదేరాయి. కష్ట, నష్టాలన్నీ తొలగి సుఖశాంతులు ప్రసాదించాలని దేవుళ్లను మొక్కుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునేలోపు రెండు కుటుంబాలతో ప్రయాణిస్తున్న కారు ఘోర రోడ్డుప్రమాదానికి గురైంది. ఏపీ రాష్ట్రం నుంచి మిర్యాలగూడలోకి ప్రవేశించిన కారు ముందుగా వెళ్తున్న ఓ వాహనాన్ని క్రాస్‌చేస్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అదుపుతప్పిన కారు ఏపీ రాష్ట్రం వైపు వాహనాలు ప్రయాణించే రోడ్డుమార్గంలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. సరిగ్గా ఇదే సమయంలో మిర్యాలగూడ నుంచి ఏపీ రాష్ట్రం గుంటూరు వైపు వెళ్తున్న పొట్టులారీ పల్టీ కొట్టిన కారును వేగంగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి దాటక జరిగిన ఘోర రోడ్డుప్రమాదంతో కారులోని ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిశాయి. కొన ఊపిరితో ఉన్న మరో మహిళ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. దీంతో ఆ రెండు కుటుంబాల్లో ఏ ఒక్కరూ మిగల్లేదు.

●7లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ వెంకటరావు

ప్రజా దరఖాస్తులను పరిష్కరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 29: ప్రజలు అందించే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకటరెడ్డితో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. మండల స్థాయిలో అన్నిశాఖల అధికారులు విధిగా ప్రజావాణి నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి హాజరుకావాలని ఆదేశించారు. వేసవికాలం సమీపిస్తున్నందున తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు, నూతన గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఎండిన వాటి స్థానంలో కొత్తగా పెంచాలన్నారు.

నులిపురుగులను నివారించాలి

నులి పురుగులను నివారించడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకటరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నులి పురుగుల నివారణ కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలో 2.13 లక్షల మంది చిన్నారులు ఉన్నారని, వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను ఏవిధంగా వేసుకోవాలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వచ్చే నెల 12న జిల్లావ్యాప్తంగా నులి పురుగుల నివారణ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం, డీఐవో డాక్టర్ వెంకటరమణ, జిల్లా సంక్షేమాధికారి జ్యోతి పద్మ, డీఐఈవో క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

జిల్లాలో నూతనంగా నియమించబడిన స్టాఫ్‌నర్సులకు నియామకపత్రాలు అందించే కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ వెంకటరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వెంకటరెడ్డి, ప్రియాంకలతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 212 మంది స్టాఫ్‌నర్సులుగా ఎంపికయ్యారని, వారికి ఈ నెల 31న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేస్తారని తెలిపారు. స్టాఫ్‌నర్సులుగా నియామకమైన వారు హైదరాబాద్ వెళ్లేందుకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో సురేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ దండ మురళీధర్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, డీపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదవాని గూడుకు మోక్షం

- మోడల్ కాలనీ ఇళ్లకు రూ.74.80 కోట్లు మంజూరు
- హామీ నెరవేర్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్, జనవరి 29 : పదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రారంభించిన మోడల్‌కాలనీకి మోక్షం కలుగనుంది. పేదవాడి ఇంటి కల నెరవేరనుంది. అసంపూర్తి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.74.80 కోట్లు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హుజూర్‌నగర్‌లో 2 వేలకు పైగా గృహాలు ఒకేసారి నిర్మాణం పూర్తి కానున్నాయి. ఇదిలా ఉండగా హామీ ఇచ్చిన నెల రోజుల్లోనే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయించారు. హుజూర్‌నగర్ పట్టణం ఫణిగిరిగుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్‌కాలనీ ఇళ్లకు మోక్షం కలిగింది. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం 2,160 ఇళ్ల నిర్మాణ పనులకోసం రూ.74.80 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు జీవో నెం.44ను విడుదల చేస్తూ ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు మరియు బిల్డింగ్ శాఖ పర్సనల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాస్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు.

గతేడాది డిసెంబరు 23న గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మొదటిసారి హుజూర్‌నగర్‌కు తీసుకువచ్చారు. ఆయనతో కలిసి మోడల్‌కాలనీ ఇళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో నెల రోజుల్లోనే నిధులు మంజూరు చేస్తామని ఉత్తమ్‌కు పొంగులేటి హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా మోడల్‌కాలనీ పూర్తికి రూ.74.80 కోట్ల నిధులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోడల్ కాలనీ నిర్మాణంపై హామీ ఇచ్చారు. అదేవిధంగా తాను పదేళ్ల కిందట మంత్రిగా ప్రారంభించిన కాలనీ నిర్మాణం తిరిగి మంత్రి హోదాలో మరోసారి నిధులు మంజూరు చేయించి పనుల పూర్తికి సిద్ధమవుతున్నారు. కాగా మంత్రి ఆదేశాల మేరు ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది.

హుజూర్‌నగర్ పట్టణంలోని మోడల్‌కాలనీపై గత ఏడాది డిసెంబరు 19న ఆంధ్రజ్యోతిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎడిషన్‌లో "మోడల్ కాలనీకి గ్రహణం వీడేనా" అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనం అనంతరం డిసెంబరు 23న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు మోడల్ కాలనీని పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దానిలో భాగంగానే రూ.74.80 కోట్ల నిధులు మంజూరు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు : ఎస్పీ

కోదాడ, జనవరి 29 : గంజాయి నిర్మూలనలో పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణా, సరఫరా, వినియోగం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా నిందితుల గుర్తింపుతో పాటు రికార్డు చేయాలని సూచించారు. అంతేకాక గంజాయి కేసులపై దర్యాప్తు పాటించాల్సిన మెళకువలు, సలహాలు, సూచనలను సీఐలకు అందించారు. నిఘా పెంచడంతో పాటు గంజాయి తీసుకోవటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పట్టణ సీఐ రాము, వీరరాఘవులు, రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




కోదాడలో ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

అసాంఘిక కార్యక్రమాలపై చట్టపరంగా చర్యలు

సూర్యాపేట క్రైం : జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాహుల్ హెగ్డే బీకే అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించి, మాట్లాడారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలను ఘర్షణలు పడవద్దన్నారు. సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ప్రజల సమస్యలపై వేగంగా స్పందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 29: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయాల బడ్జెట్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాల సంస్థ ఆధీనంలో పబ్లిక్ రీడింగ్ గదుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కావాల్సిన పుస్తకాలు, ఫర్నీచర్, భవనాల మరమ్మతులకు అవసరమైన నివేదికను అందజేయాలన్నారు. సమావేశంలో డీపీవో యాదయ్య, డీఈవో అశోక్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కేవీ సీతారామశాస్త్రి, సిబ్బంది రంగారావు, శ్రవణ్‌కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలగడప' ఆణిముత్యం

● కబడ్డీలో జాతీయ స్థాయి ప్రతిభ ● తెలంగాణ కెప్టెన్‌గా లక్ష్మణ్

మిర్యాలగూడ రూరల్, జనవరి 29: వ్యవసాయ కుటుంబం, కూలీ నాలి పనులతో జీవనం సాగించే కార్మిక, కర్షకుల జీవన నేపథ్యం కలిగిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఆలగడప నుంచి జాతీయ స్థాయి ప్రతిభ కనబర్చాడు నల్లగొండ లక్ష్మణ్. మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం సాగించి, మిర్యాలగూడ పట్టణంలో ఇంటర్ చదివాడు. గిరిజన కుటుంబంలో పుట్టి ప్రతిభా పాటవాన్ని పెంపొందించుకొని నేడు జాతీయ స్థాయిలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. నల్లగొండ వెంకన్న గురువమ్మల రెండో కుమారుడు నల్లగొండ లక్ష్మణ్ చిన్నప్పటి నుంచి తన తండ్రి వారసత్వంగా, గ్రామ కబడ్డీ క్రీడాకారుల ప్రోత్సాహంతో కబడ్డీనే ప్రాణంగా భావించాడు. క్రీడా పోటీలను తన ఆలోచనలతో నింపుకొని అందరి సహకారంతో నేడు జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. గ్రామంలో నిర్వహించే కబడ్డీ పోటీలను ఆసక్తిగా మార్చుకొని కబడ్డీ క్రీడారంగంలోకి ప్రవేశించాడు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ టీం కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

సాధించిన విజయాలు

అండర్-14 మధ్యప్రదేశ్ నేషనల్ మీట్‌లో 2016, అండర్-17 2018లో పాల్గొన్నాడు. సబ్ జూనియర్ నేషనల్ మీట్‌లో బీహార్‌లో ప్రతిభ చాటాడు. జూనియర్ నేషనల్స్‌లో 2022-23లో ఉత్తరాఖాండ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2024 జనవరి 11, 12, 13, 14వ తేదీల్లో గజ్వేల్‌లో జరిగిన 33 జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయికి ఎదిగాడు. తన ప్రతిభను గుర్తించిన కబడ్డీ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర టీం కెప్టెన్‌గా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ కెప్టెన్‌గా లక్ష్మణ్ ఎంపికవడం పట్ల తల్లిదండ్రులు, తోటి మిత్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత ఫేస్‌క్రీమ్‌ల పట్టివేత

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: నిషేధిత కంపెనీలకు చెందిన 60ముఖ సౌందర్య ఫేస్ క్రీమ్ ట్యూబ్‌లను ఔషధ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి ఈ మేరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో ఇన్‌చార్జి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముఖ చర్మ రంగుమార్పు, ముడతలు కనిపించకుండా ఉండేలా మెడికల్‌షాపుల్లో కొన్ని రకాల కంపెనీలకు చెందిన క్రీమ్‌లను విక్రయిస్తున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు మిర్యాలగూడ పట్టణం ఇస్లాంపురలోని గోపికృష్ణ మెడికల్‌షాపులో తనిఖీ చేయగా బీసీఎల్ ఫార్మ కంపెనీకి చెందిన 60 ఫేస్‌క్రీమ్ ట్యూబ్‌లు లభ్యమయ్యాయి. వీటిని హైదరాబాద్ మేడిపల్లిలోని మానస డిస్ట్రిబ్యూటరీ నుంచి దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలకు వచ్చినట్లు సమాచారం అందుకున్న కొందరు మెడికల్ దుకాణాల వ్యాపారులు సోమవారం రాత్రి వరకు తమ దుకాణాలను మూసివేశారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి

ఢిల్లీలో నిర్వహించనున్న సీనియర్స్ పోటీల్లో పాల్గొననున్న తరుణ్

నిడమనూరు, జనవరి 29: నల్లగొండ జిల్లా మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పేర్ల తరుణ్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మే నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న సీనియర్స్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో తరుణ్ రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నాడు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన తమ పాఠశాలకు చెందిన విద్యార్థి తరుణ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత, పీడీ బెజవాడ గిరివరప్రసాద్, అధ్యాపక సిబ్బంది అభినందించారు. పోటీల్లో తమ విద్యార్థి చక్కటి ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పేర్ల తరుణ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుండాల, జనవరి 29: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ యాకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓర్సు మైసయ్య (54) గ్రామ శివారులో బహిర్భూమి కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టు పక్కల ప్రాంత రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఓర్సు మైసయ్య మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మైసయ్య భార్య ఓర్సు మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 29: తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతు చినబిక్షాలు రోజు మాదిరిగా సోమవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కగా మోకు జారి కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రైలునుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి రూరల్, జనవరి 29: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపునకు వెళ్తున్న రైలులో నుంచి జారిపడి భువనగిరి- వంగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నెంబర్ 248/10-12 మైలురాయి వద్ద గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతిచెందాడు. వయస్సు 40 నుంచి 45సంవత్సరాలు ఉంటాయని, మృతదేహం తెలుపురంగు గీతల షర్టు, బూడిద కలర్ పాయింట్ కుడివైపు పొట్టపై, చాతి కింద పుట్టుల ఉన్నాయని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. సంఘటనా స్థలంలో పంచనామా చేపట్టి కేసు నమోదు చేసుకున్నామని మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9848222169కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గమ్యానికి చేరువలో.. మృత్యు ఒడిలోకి


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

- ● దైవదర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణంలో విషాదం
- ● వాహనాన్ని క్రాస్‌చేస్తుండగా అదుపుతప్పిన కారు
- ● డివైడర్ దాటి రోడ్డుపై పల్టీ.. లారీ ఢీ కొట్టి ఈడ్చుకెళ్లిన వైనం
- ● ఆరుగురు మృత్యువాత.. ఛిద్రమైన రెండు కుటుంబాలు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: పుణ్యక్షేత్రాలకు వెళ్లి కారులో తిరిగి వస్తున్న రెండు కుటుంబాలు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్‌రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. డీఎస్పీ వెంకటగిరి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామానికి చెందిన చెరుపల్లి మహేష్, యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తన తోడల్లుడు బొమ్మ మశ్చేందర్ కుటుంబసభ్యులు దైవదర్శనం, ఈనెల 26న విహారయాత్రకు వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో మహేష్, మశ్చేందర్ కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న కారు మిర్యాలగూడలోని కృష్ణమానస కాలనీ వద్ద అద్దంకి - నార్కట్‌పల్లి రోడ్డుపై ఆదివారం రాత్రి రోడ్డుప్రమాదానికి గురైంది. ఓవర్ టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో చెరుపల్లి మహేష్(32), అతని భార్య జ్యోతి(30) కుమార్తె రిషిత(6) యాదాద్రిజిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అతని తోడల్లుడు బొమ్మ మశ్చేందర్(29) కుమారుడు లియాన్స్(2) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కారు వెనుక సీట్లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మశ్చేందర్‌భార్య మాధవి(24)ని స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మాధవి మృతిచెందడంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఏరియా ఆస్పత్రి వద్దకు మృతుల బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కన్నీరు పెట్టుకున్నారు. నందిపాడు గ్రామానికి చెందిన మహేష్ హైదరా బాద్ వనస్థలిపురంలో నివాసముంటూ అవుట్‌డోర్ ఫొటోగ్రాఫీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదేవిధంగా మశ్చేందర్ తన స్వగ్రామమైన గొల్నేపల్లిలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.



జ్యోతి, మాధవి మృతితో విలపిస్తున్న దత్తత తల్లిదండ్రులు నాగభూషణం,పద్మ

140 కిలోమీటర్లు వెళ్లి లారీని పట్టుకున్న పోలీసులు

ప్రమాదానికి కారణమై పరారైన లారీని గుర్తించేందుకు డీఎస్పీ పర్యవేక్షణలో మిర్యాలగూడ పోలీసులు 140 కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. టూ టౌన్ ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన రెండు పోలీస్ బృందాలు పట్టణంలోని నందిపాడు, చింతపల్లి చౌరస్తా సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి లారీని ప్రాథమికంగా గుర్తించారు. ఏపీ రాష్ట్రం పిడుగురాళ్ల టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలను పరిశీలనలో ముందుభాగం దెబ్బతిన్న టీఎస్12 యూఈ 2383 నెంబర్‌గల లారీని గుర్తించి ఏపీ పోలీసులను సమాచారం అందించారు. అద్దంకి వద్ద ప్రమాదానికి కారణమైన లారీని మిర్యాలగూడ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆరుగురి మృతికి కారణమైన లారీని పట్టుకునేందుకు శ్రమించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. జ్యోతి తండ్రి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతదేహాలకు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మహేష్, జ్యోతి, రిషిత మృతదేహాలకు నందిపాడులో అంత్యక్రియలు పూర్తిచేయగా, మశ్చేందర్, మాధవి, లియాన్ మృతదేహాలకు యాదాద్రి జిల్లా వలిగొండమండలం గొల్నేపల్లిలో దహనసంస్కారాలు పూర్తిచేశారు. రెండు కుటుంబాలకు చెందిన వారంతా ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

పేగుబంధం లేకున్నా ప్రేమబంధం పంచి..

నందిపాడు గ్రామానికి చెందిన దేవులపల్లి నాగభూషణం తన సోదరి మంగమ్మ కుమార్తెలైన జ్యోతి, మాధవిలను చిన్నతనంలోనే దత్తత తీసుకున్నాడు. పేదరికంలో ఉన్న తన సోదరికి ఆడపిల్లలు భారంగా మారకూడదన్న భావనతో చేరదీసిన నాగభూషణం, పద్మ దంపతులు సొంత కుమార్తెలుగా భావించి కష్టపడి పోషించారు. ఓ రైస్‌మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నాగభూషణం తన పెంపకంలో ఉన్న జ్యోతిని బీఎస్సీ, బీఈడీ వరకు, మాధవిని బీటెక్ వరకు చదివించి ఎనిమిదేళ్ల క్రితం నందిపాడుకు చెందిన మహేష్‌తో జ్యోతికి పెళ్లిచేయగా, మూడేళ్ల క్రితం మాధవికి మశ్చేందర్‌తో వివాహం జరిపించాడు. మేనకోడళ్లకు ఏ లోటూ రాకుండా కన్నబిడ్డల వలే అల్లారుముద్దుగా పెంచుకున్న జ్యోతి, మాధవీలు విగతజీవులుగా మారడాన్ని ఆ దంపతులు జీర్ణించుకోలేక కన్నీటి పర్యంతమవుతున్నారు. పేగుబంధం లేకపోయినా ప్రేమబంధంతో పెంచుకున్న పిల్లలిద్దరితోపాటు, వారి భార్త పిల్లలు మృత్యుతదేహాల వద్ద పెంపుడుతల్లి (మేనత్త) విలపించిన తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

నలుగురికి కంటి చూపు

రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందిన మహేష్, జ్యోతి నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానం చేసేందుకు తల్లి మంగమ్మతోపాటు మేనమామ, అత్త(పెంపుడు తల్లిదండ్రులు) నాగభూషణం- పద్మ అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రికి చెందిన వైద్యులు నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. అకాలమరణం చెందిన దంపతుల నేత్రాలతో మరో నలుగురి చూపునిచ్చే అవకాశముంటుందని వైద్యులు తెలిపారు. చిన్నారులు రిషిత, లియాన్స్, మశ్చేందర్, మాధవి దంపతుల నేత్రాలను సైతం సేకరించేందుకు వారి కుటుంబీకులు అంగీకరించినా వైద్య పరీక్షల్లో వారి నేత్రాలు ప్రమాదంలో దెబ్బతిన్నట్లుగా నిర్ధారించి సేకరించలేదు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలను చూసి చలించిపోయారు. బంధువులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులను ఆయన ఫోన్లో పరామర్శించారు.

గొల్నెపల్లిలో విషాదచాయలు

వలిగొండ: మిర్యాలగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొమ్మ మచ్చేందర్, అతని భార్య మాధవి, కుమారుడు లియాన్ష్ మృతితో మండలంలో గొల్నెపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మృత్యువాత పడడంతో గ్రామ శోకసంద్రంగా మారింది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎవరినోట విన్నా మచ్చేందన్ కుటుంబం మృతిచెందారన్న చర్చ సాగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి నాగమ్మ తలకొరివి పెట్టింది. ఆ గ్రామ చివరన ఉన్న స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. మచ్చేందర్, మాధవి, లీయాన్ష్ మృతదేహాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.


వలిగొండ మండలం గొల్నెపల్లిలో మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నడిగూడెం ఉన్నత పాఠశాలను కప్పేసిన మంచు




ఉదయం 9గంటల సమయంలో లైట్ల వెలుగులో వాహనాల రాకపోకలు

అబ్బబ్బో.. మంచువాన

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల ప్రజలను సోమవారం ఉదయం మంచువాన కప్పేసింది. ఉదయం 5గంటల నుంచి పొగమంచుతో కూడిన మంచు చినుకులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేశాయి. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు ఉన్నత పాఠశాలలో వ్యాయమం చేసేవారు మంచుతో ఇబ్బంది పడ్డారు. సుమారు మూడు గంటల పాటు మంచు కమ్మేయడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే కూలీలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

● నడిగూడెం

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

వలిగొండ, జనవరి 29: మానసిక పరిస్థితి సరిగా లేక ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిలాల్ల వలిగొండ మండలంలోని గొల్నెపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొల్నెపల్లి గ్రామానికి చెందిన రాధారపు రమేష్(30) మానసిక స్థితి సరిగా లేక ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా రమేష్ భార్య రెండు నెలల క్రితం డెలివరీ నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నార్కట్‌పల్లి, జనవరి 29: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టులో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థాన సిబ్బంది సమాచార మేరకు గట్టుపైన రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండగా వెళ్లి పరిశీలించే సరికి చనిపోయి ఉన్నాడు. వృద్ధుని వయస్సు 65 సంవత్సరాల ఉంటుందని ఎస్ఐ తెలిపారు. దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అడ్డగూడూరు యువకుడు చెన్నైలో మృతి

అడ్డగూడూరు, జనవరి 29: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన యువకుడు సోమవారం చెన్నైలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగూడూరు మండలకేంద్రానికి చెందిన గుంజ శ్రీను-సత్తమ్మ దంపతుల కుమారుడు గుంజ చందు(22) ఇటీవలే బీటెక్ పూర్తి చేశాడు. సోమవారం ఉద్యోగ పేస్‌మెంట్ల నిమిత్తం బెంగళూరు వెళ్తున్నట్లు చెప్పి చెన్నైలో రైలు పట్టాలపై విగత జీవిగా కన్పించాడు. చెన్నై పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం తెలిసింది. మృత్తికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రైవేట్ వ్యక్తులతో వాహనాల తనిఖీలు

కోదాడ రూరల్, జనవరి 29: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధి రామాపురం క్రాస్‌రోడ్డులోని ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వారం రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ తనిఖీలకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించకుండా ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసి వారిచే వాహనాల తనిఖీ నిర్వహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ మధ్య రోజుకు పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో గూడ్స్ వెహికల్స్ కూడా ఉన్నాయి. విజయవాడ, హైద్రాబాద్ మధ్య భారీ స్థాయిలో వ్యాపారస్థులు కొనుగోళ్లు నిర్వహిస్తుంటారు. కొనుగోలు చేసిన వాటికి సరైన బిల్లులు ఉన్నాయా, లేదా అన్నది వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తమ తనిఖీల్లో తెలుసుకుంటుంటారు. అందులో భాగంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే తనిఖీలు నిలుపుదల చేశారు. తిరిగి మరలా వారం, పదిరోజులుగా తనిఖీలు ప్రారంభించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను విచారించగా, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినట్లు వారు తెలిపారు. తనిఖీలు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయడం వల్ల వారు వచ్చిపోయే వాహనాలను ఆపి పెద్దఎత్తున డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై వాహనదారులు సైతం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయడంపై ఎస్టీవో సంపత్‌ను ప్రశ్నించగా, సిబ్బంది లేకపోవడం వల్లే ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.


సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

బంగారం చోరీ నిందితుల రిమాండ్

తిప్పర్తి, జనవరి 29: ద్విచక్ర వాహనంపై వెళ్లి బంగారం చైన్ చోరీ చేసిన నిందితులను సోమవారం తిప్పర్తి పోలీసులు రిమాండ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన సల్లంగుల శివకుమార్(26), నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన సంపంగి యువరాజ్(23), నల్లగొండ జిల్లాకేంద్రం శ్రీరాంనగర్ కాలనీకి చెందిన సంపంగి వెంకటేష్(26) బంధువులు. వీరు నల్లగొండ పట్టణంలో కూలీ పనులకు వెళ్తుంటారు. ఈ నెల 21న వీరు గొలుసు చోరీకి పథకం వేసుకొని నల్లగొండ మండల పరిధిలోని పెద్ద సూరారం గ్రామానికి చెందిన ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. కాగా అదే రోజు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులు, వారి ద్విచక్ర వాహనాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సోమవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన యువకులను గుర్తు పట్టిన పోలీసులు వారిని పట్టుబడి చేసి వారు చోరీ చేసిన మూడు తులాల బంగారు గొలుసును రికరీ చేసి కోర్టుకు పంపించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, జనవరి 29: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ డి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రావులపెంట గ్రామానికి చెందిన జంగిలి యల్లయ్య, పసుల రమేష్‌లు తమ ట్రాక్టర్ల ద్వారా వేములపల్లి మండలంలోని గ్రామ శివారులోగల మూసీ వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

చివ్వెంల, జనవరి 29: బీఆర్ఎస్ హయాంలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం చివ్వెంల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో శాశ్వతంగా గుర్తుండేలా జరిగిన అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పనితీరు అమోఘమన్నారు. మరో రెండు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతుందని, పదవి లేకున్నా ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారి బాబునాయక్, జడ్పీటీసీ భూక్యా సంజీవనాయక్, ఎంపీడీవో లక్ష్మీ, ఎంపీవో గోపి, పీఏసీఎస్ చైర్మన్ సుదీర్‌రావు, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దావత్‌కోసం సర్పంచ్‌ల నుంచి డబ్బు వసూలు?

ప్రతి మూడు నెలలకోసారి ప్రజాసమస్యలపై ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసే సర్వసభ్య సమావేశం ఈసారి సన్మానాలకు మాత్రమే పరిమితమైంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున.. గ్రామాల్లో చేసిన పెండింగ్ బిల్లులకు సహకరించాలంటే దావత్ ఇవ్వాలని, దీని కోసం సర్పంచ్‌ల నుంచి కొంత డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు అధిక శాతం బీఆర్ఎస్‌లో ఉండడంతో ఓ నాయకుడి సహకారంతో ఎంపీడీవో కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు దావత్ కోసం డబ్బులు వసూల్ చేసినట్లు సమాచారం. అధికారుల పర్యవేక్షణలోదావత్ కోసం కార్యాలయ ఆవరణలో మాంసాహార వంటలను వండడంతో, సంబంధిత ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కార్యాలయానికి సమీపంలోని ఓ వెంచర్‌లో దావత్ ఏర్పాటు చేయగా, సంబంధిత ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సిబ్బంది హుటాహుటిన దావత్ ఏర్పాట్లను రద్దుచేసుకున్నట్లు తెలిసింది. ఇదే విషయమై జడ్పీ సీఈవోను వివరణ కోరగా కార్యాలయంలో వంటలు వండిన విషయం తన దృష్టికి వచ్చిందని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చివ్వెంల మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

ఆత్మకూర్(ఎస్): సమాజంలో మనిషికి కావాల్సిన హక్కులు, విధులను రాజ్యాంగబద్ధంగా అమలు పరిచేందుకు అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ కట్టుబడి ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణులు వేదాలు మాత్రమే చదువుతున్నారని, అంబేద్కర్ ప్రపంచాన్ని చదివిన మేధావని, ప్రపంచంలో అత్యధిక విగ్రహాలు కల్గిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. మనిషి జీవితంలో చదువు ఒక్కటే అభివృద్ధికి కారణమని అంబేద్కర్ తెలిపారని అన్నారు. అంబేద్కర్ ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, భువనగిరి జడ్పీ చైర్మన్, సందీప్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ ఇందూరు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు



బాలాజీ (ఫైల్ ఫొటో)

అనంతగిరి, జనవరి 29: మండలంలోని తమ్మర బ్రిడ్జి సమీపంలో బైకు, ఆటో ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొజ్జగూడెంతండాకు చెందిన ధరావత్ బాలాజీ(53) తన వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం మోపెడ్‌పై కోదాడకు వచ్చి మధ్యాహ్నం సమయంలో తిరిగి వెళుతుండగా తమ్మర బ్రిడ్జిస సమీపంలో ఖమ్మం నుంచి కోదాడకు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బాలాజీ అక్కడిక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ దాసోజు నాగేంద్ర బాబుకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు బాలాజీ భార్య నీలాబాయి ఇద్దరు కుమారులు ప్రశాంత్, నిశాంత్‌లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు



వెంకట్‌రెడ్డి, చివ్వెంల



రవీందర్, పెన్‌పహాడ్



మహేందర్, అర్వపల్లి

చివ్వెంల, పెన్‌పహాడ్, అర్వపల్లి, జనవరి 29: చివ్వెంల, పెన్‌పహాడ్, అర్వపల్లి ఎస్ఐలుగా బీరెల్లి వెంకట్‌రెడ్డి, పెరక రవీందర్, మహేందర్ నాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెన్‌పహాడ్ ఎస్‌గా పనిచేసిన విష్ణుమూర్తి ఎస్పీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు. పెన్‌ప హాడ్ ఎస్ఐగా పనిచేసిన వెంకన్నగౌడ్, సూర్యాపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. సూర్యాపేట వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న పెరక రవీందర్ బదిలీపై పెన్‌పహాడ్‌కు వచ్చారు. అర్వపల్లి ఎస్ఐగా పనిచేసిన అంజి రెడ్డిని వీఆర్‌లో ఉంచారు. సూర్యాపేట టౌన్ పోలీస్‌స్టేషన్ పనిచేసిన మహేందర్‌నాథ్ బదిలీపై అర్వపల్లికి వచ్చారు.

సోమప్ప దేవాలయం చైర్మన్ రాజీనామా

నేరేడుచర్ల, జనవరి 29: మండలంలోని చారిత్రక సోమప్ప దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా రాచకొండ శ్రీనివాసరావు తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామాపత్రాన్ని దేవాదాయశాఖ అధికారులకు పంపారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మూడేళ్ల పాటు చైర్మన్‌గా పనిచేశానని, దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధికి కృషిచేశానన్నారు.

'కంటి వెలుగు వాహనాల అద్దె చెల్లించాలి'

నేరేడుచర్ల, జనవరి 29: గత రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమానికి కిరాయికి తీసుకున్న ప్రైవేటు వాహనాల అద్దెలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 52వాహనాలను అద్దెకు తీసుకుని, ఒక్కో వాహనానికి నెలకు రూ.33వేలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారన్నారు. రెండు నెలల బిల్లు మాత్రమే చెల్లించారని, మరో మూడు నెలల కిరాయి పెండింగ్‌లో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కిరాయిలు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఊదర వెంకన్న, మన్నెం మధు, వెంకన్న, వాసా అశోక్, రామయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, జనవరి 29: పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనికాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడే చల్లా తేజ అన్నారు. మద్దిరాల మండంలోని కుక్కడం గ్రామానికి చెందిన గోండ్యాల కొమరమ్మ ఇటీవల మృతి చెందగా, సోమవారం ఆమె కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కుక్కడం, తుంగతుర్తి మండలంలోని రావులపల్లి, మానాపురం గ్రామాల్లో క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఇటీవల గ్యాస్ ప్రమాదంలో మృతి చెందిన మల్లయ్య కుటుంబానికి రూ.5వేలు, ఏనకుంట తండాలో అమ్ము కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నాగారం మండలం లోని పసునూరు, శాంతినగర్ గ్రామాల్లో పదవతరగతికి విద్యార్థులకు పరీక్షల సన్నదత కోసం స్టడిమెటిరియల్ పంపిణీ చేశారు. ఓ కాంగ్రెసు కార్యకర్త కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. .కార్యక్రమంలో పసుల అశోక్ ప్రశాంత్, గోవర్దన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

భానుపురి, జనవరి 29: ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు రెగ్యూలర్, ఫెయిలైన విద్యార్థులు పరీక్ష రుసుము(అపరాధ రుసుము) ఫిబ్రవరి ఐదో తేదీ వరకు చెల్లించాలని సూర్యాపేట డీఈవో అశోక్ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు రూ.1000ల అపరాధరుసుముతో చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఫిబ్రవరి 6న ఎస్‌బీఐ ట్రెజరీలో చెల్లించాలన్నారు.

భూవివాదం పరిష్కారానికి ఐఏఎస్‌ను నియమించాలి

మఠంపల్లి, జనవరి 29: మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలో సర్వే నెం.540లో ఉన్న భూవివాద పరిష్కారానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించి గిరిజనులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఐడీసీ మాజీ రాష్ట్ర డైరెక్టర్ సాముల శివారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా సర్వే నెం.540లో ఉన్న భూములతో మండలంలోని గుర్రంబోడుతండా, భోజ్యాతండా, రామచంద్రాపురంతండా రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.సమావేశంలో పార్టీ నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, సింగారపు సైదులు, ఎల్లారెడ్డి, పిచ్చిరెడ్డి, ఎస్.శ్రీనివాస్, ఎంఎం యాదవ్, గాయం ఆదినారాయణరెడ్డి, బూర సోములు, సక్కునాయక్, బాలనాయక్ తదితరులు ఉన్నారు.

గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి

మునగాల, జనవరి 29: ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని వ్యకాస జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల పక్షాన సీపీఎం పోరాడుతుందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు అంజనేయులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోమపంగు జానయ్య, అరె కృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న గడ్డం వెంకన్న, తొగటి వేలాద్రి, గట్టు శ్రీను, సాలె రవి, గోవిందు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

'దళిత మహిళా చైర్‌పర్సన్‌కు మద్దతుగా వెనక్కితగ్గా'

సూర్యాపేట టౌన్, జనవరి 29: దళిత మహిళ అయిన సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్‌కు మద్దతుగా అవిశ్వాసానికి వెనక్కి తగ్గానని 45వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ముందుగా సుముఖతతో ఉన్నానని, బీసీ బిడ్డగా తనకు అవకాశం వస్తుందని భావించానన్నారు. అవిశ్వాసం సందర్భంగా అసమ్మతి కౌన్సిలర్లలో స్వార్థం కనిపించిందని, బీసీలకు తగిన గుర్తింపు, అవకాశం లేనందున దళితమహిళా చైర్‌పర్సన్‌కు మద్దతు నిలిచానని, ప్రలోభాలకు తాను లొంగలేదని తెలిపారు బహుజనులకు రాజ్యాధికారం కోసం బీఆర్ఎస్ నుంచి గెలిచిన తాను బీఎస్పీలో ఇటీవల చేరానన్నారు. త్వరలో బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరతానన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఏకమై నిరసన పేరుతో తన ఇంటిపై కోడిగుడ్లు, మట్టి పోయడం దారుణమన్నారు. నిరసనలు, ఆందోళనల పేరుతో తన కుటుంబ సభ్యులను దూషించడం సరికాదన్నారు. 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి ఏర్పాటు చేసిన క్యాంపునకు తాను వెళ్లలేదని, ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా నిర్ణయం చెప్పే పరిస్థితి లేదా? అని ఆమె ప్రశ్నించారు.

'అభివృద్ధి, ఆత్మగౌరవం కోసమే అవిశ్వాస ప్రయత్నం'

సూర్యాపేట టౌన్, జనవరి 29: సూర్యాపేట పట్టణ అభివృద్ధి, ఆత్మగౌరవం కోసమే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని సూర్యాపేట మునిసిపల్ అసమ్మతి కౌన్సిలర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అవిశ్వాసం వీగిందని 45వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట తాము నిరసనలు చేశామని, దీనిని రాజకీయం చేయొద్దన్నారు. కౌన్సిలర్లపై దాడ చేసే సంస్కృతి, రౌడీ రాజకీయాలను ప్రోత్సహించేతత్వం ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిదని ఆరోపించారు. పదేళ్లపాటు కష్టపడిన తాము ఎందుకు వ్యతిరేకంగా మారామో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి గ్రహించాలన్నారు. పట్టణ అభివృద్ధి కోసమే 31మంది కౌన్సిలర్లమైన తాము కలిసికట్టుగా పోరాటం చేస్తామన్నారు. నాలుగేళ్లుగా సూర్యాపేట మునిసిపాలిటీలో కౌన్సిలర్లకు ఎలాంటి గౌరవం దక్కలేదన్నారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపారన్నారు. సాంకేతికంగా అవిశ్వాసంతో ఓడినా నైతికంగాప్రజల్లో గెలిచామన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన 31వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డిపై దాడి జరిగితే పరామర్శించడానికి ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిరాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అసమ్మతి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో గమన్‌రెడ్డికి గోల్డ్‌మెడల్

నేరేడుచర్ల, జనవరి 29: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఇండోర్ స్టేడియంలో ఈనెల 28న జరిగిన 2వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2024పోటీల్లో నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్‌రెడ్డి అండర్-20 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆయన తండ్రి ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో మూడో తరగతి చదువుతున్న గమన్‌రెడ్డి సిట్స్ సంస్థలో కోచ్ సైకం సుబ్బారావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడన్నారు. అర్జెంటీనాలో జరిగే ప్రపంచస్థాయి పోటీలకు గమన్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. గమన్‌రెడ్డిని తాత, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, తల్లిదండ్రులు అభినందించారు.

మండల వాసికి డాక్టరేట్

కోదాడ రూరల్, జనవరి 29: మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన ఎస్‌కే హసన్‌జానీకి తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి డాక్టరేట్ అందజేశారు. తమిళనాడులోని కరైకుడి అలగప్ప యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో "ఎఫెక్ట్ ఆఫ్ ఎరోబిక్ సర్క్యూట్ ట్రైనింగ్ అండ్ సస్పెన్షన్ ట్రైనింగ్ సెలెక్టెడ్ పెర్ఫామెన్స్ పారామీటర్ ఆఫ్ ది సీనియర్ అథ్లెట్" అనే అంశంపై ప్రొఫెసర్ వైరవ సుందరం పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు అలగప్ప యూనివర్సిటీ 34వ కాన్వకేషన్ లో హసన్‌జానీకి డాక్టరేట్‌ను తమిళనాడు గవర్నర్ అందజేశారు.

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

హుజూర్‌నగర్, జనవరి 29: కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. సోమవారం పట్టణంలోని రైస్‌మిల్లు డ్రైవర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.నూతన కార్మిక చట్టాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, రామయ్య, వీరబాబు, రామారావు, గణేష్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

సూర్యాపేట టౌన్, జనవరి 29: కరాటేతో ఆత్మరక్షణ పెంపొందుతుందని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన తైక్వాండో క్యోరుజీ అండ్ పూమ్‌సే ఓపెన్ మార్షల్ ఆర్ట్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని అభినందించి మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబర్చిన 22మంది విద్యార్థులకు మెడల్స్ అందజేశారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

పెన్‌పహాడ్, జనవరి 29: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో రవి అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో నిర్వహించిన నాటక పోటీలు, ఆంగ్ల భాషా ప్రావీణ్యంపై నిర్వహించిన పోటీల్లో ఆయన మాట్లాడారు. నాటిక పోటీల్లో పెన్‌పహాడ్ జడ్పీహైస్కూల్, ఆంగ్ల భాషా పోటీలో చీదెళ్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, కరుణశ్రీ, మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

సూర్యాపేట(కలెక్టరేట్), నేరేడుచర్ల, తిరుమలగిరి రూరల్, జనవరి 29: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. ఎన్నికల విధులు నిర్వహించినవారికి డీఏలు చెల్లించలేదన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం అమలు చేసి జాబ్‌చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఆశాలకు జీఎన్ఎం, ఏఎన్ఎం ఉద్యోగాల భర్తీ సమయంలో వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విజయ, జయమ్మ, ధనమ్మ, మాధవి, అనిత, రజిత, కళమ్మ, స్వరూప, వసంత, సావిత్రి, సక్కుబాయి, ఉమా, సునీత, శాంతి, శోభ, శారద, జ్యోతి పాల్గొన్నారు.

● నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై తగు విచారణ చేయాలని సంఘం డైరెక్టర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట్రావ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ 2020-21లో ఐకేపీ ద్వారా ధాన్యాన్ని సంఘంలో ఉన్న రైతుల నుంచి కాకుండా ఇతరుల నుంచి కొనుగోలు చేశారన్నారు. సంఘం చైర్మన్, సీఈవో కుమ్మక్కై ఓ రైస్ మిల్లు యజమానితో అక్రమంగా లక్షా 25వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేశారని, ఆ డబ్బును చైర్మన్‌తో పాటు సీఈవో కాజేశారని ఆరోపించారు. ఈ విషయమై చైర్మన్, సీఈవోను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదన్నారు. రైతుల పేరిట బోగస్ ఖాతాలు సృష్టించి డబ్బులను కాజేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో సంఘం డైరెక్టర్లు రాంరెడ్డి, ముత్తమ్మ, వెంకయ్య, హేమలత, రంగారెడ్డి, సైదులు, శ్రీను, వల్లభరెడ్డి, రమణారెడ్డి, గంగరాజు తదితరులు ఉన్నారు.

● తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలోని సర్వే నెంబరు 98లో గల ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేటు కంపెనీకి ఇచ్చిన గ్రానైట్ లీజును వెంటనే రద్దు చేయాలని సర్పంచ్ నెమరుగొమ్మల శాతవాహనరావు కోరారు. కలెక్టరేట్‌లో పలువురు గ్రామస్థులతో కలిసి కలెక్టర్ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందించారు. 2018లో అప్పటి రెవెన్యూ అధికారులు ఎలాంటి పంచనామా చేయకుండా గ్రానైట్ లీజుకోసం ఎన్‌వోసీ ఇచ్చారని తెలిపారు.

విద్యార్థుల కోసం ఏ సాయానికైనా సిద్ధం

సూర్యాపేట రూరల్, జనవరి 29: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ సాయానికైనా స్ప్రెడ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ముందుంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇమాంపేట కస్తూర్బా గాంధీ షైనార్టీ పాఠశాలలో స్ప్రెడ్ ఇండియా సహకారంతో సుమారు రూ.60వేల వ్యయంతో ఏర్పాటుచేసిన 13గ్రీన్ బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను తన సోదరుడు స్ప్రెడ్ ఇండియా సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్‌రెడ్డి సహకారంతో సమకూరుస్తానని, పాఠశాలలో సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 130 మంది విద్యార్థులు ఉన్న కస్తూర్బా పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానమైన తాగునీటి సమస్యను తీర్చేందుకు 1000లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకులను వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, తరగతి గదుల్లో ఎల్ఈడీ లైటింగ్, బెంచీలను రంగులు వేయిస్తామని అన్నారు. కస్తూర్బా పాఠశాలను దత్తత తీసుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పాఠశాల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి కృషి చేస్తానన్నారు కస్తూర్బా పాఠశాలకు 10సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తానని సూర్యాపేట కౌన్సిలర్ వెలుగు వెంకన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్ప్రెడ్ ఇండియా నిర్వహకుడు రమేష్‌బాబు, దయానంద్, తండు శ్రీనివాస్‌గౌడ్, పిల్లల రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇమాంపేట కస్తూర్బా పాఠశాలలో గ్రీన్ బోర్డులను ఆవిష్కరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయాలి



త్యాగరాజ ఆరాధన ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుధాబ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్

సూర్యాపేటటౌన్, జనవరి 29: సుధా బ్యాంక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 31వ తేదీన ఏర్పాటు చేసిన త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయాలని సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంకు సమావేశ మందిరంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు.ఈ సందర్భంగా మారుతి విద్యానికేతన్ విద్యార్థుల కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రముఖ గాయని, అన్నమాచార్య భవనవాహిని ట్రస్టు చైర్మన్ పద్మశ్రీ శోభారాజుని సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థానం చేరుకోవాలి

హుజూర్‌నగర్, నడిగూడెం, జనవరి 29: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థానం చేరుకోవాలలి ఎస్సీ గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ (ఆర్సీవో) అరుణకుమారి అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్, ఇంటర్ సొసైటీ లీగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అథ్లెటిక్స్, గేమ్స్ పోటీల్లో గెలుపొందిన హుజూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు కె.ప్రవీణ్, కె.శ్రీవిజ్ఞాన్, పి.నరేందర్, ఆర్.చంద్రహరితేజను సోమవారం గురుకులంలో ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నడిగూడెం గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణమూర్తి, ధన విజయలక్ష్మి వైస్‌ప్రిన్సిపాల్స్ నందానాయక్, వసంత పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఆర్సీవో అరుణకుమారి



హుజూర్‌నగర్: పట్టణంలో ఇటీవల మృతి చెందిన పాలపాటి శేఖర్ కుటుంబానికి ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో 50కిలోల బియ్యం, సరుకులను కమిటీ సభ్యులు సులువ చంద్రశేఖర్, శ్రీనివాస్, శివశంకర్ అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, కలామ్, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

● ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఇబ్బందులు తొలగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మన్సూర్‌అలీ కోరారు. ఆధార్‌కార్డు మార్పుల కోసం పట్టణంలోని పోస్టాఫీస్‌లో వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవో నారాయణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మూడు ఆధార్ సెంటర్లలో సైట్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో గోపి, వెంకటేశ్వర్లు, రాము, సాయి పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, అర్చకులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్లులేని పేదలకు పంపిణీ చేయాలని, అంబేద్కర్ భవనాలకు నిధులు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ సైదులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు, సాయిశ్రీను, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని కాపుగల్లు గ్రామం బీమా గ్రామంగా ఎంపికైందని ఎల్ఐసీ ఏజెంట్లు బాడిశ రామారావు, బ్రహ్మం, వెంకటాచారి, వీరబాబు తెలిపారు. 2021-23 సంవత్సరంలో గ్రామం నుంచి 100పాలసీలతో రూ.10 లక్షల నగదు చెల్లించినందున కోదాడ బ్రాంచ్ నుంచి ఈ గ్రామాన్ని బీమా గ్రామంగా ఎంపిక చేసినందున గ్రామానికి నాలుగు సోలార్ లైట్లు మంజూరు చేశారన్నారు. సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కాసాని వెంకటేశ్వర్లు, ఏజెంట్ల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 3వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్ళమూడి రమేష్‌బాబు తెలిపారు. ఈ సంబురాలకు మండలంలోని మాధవరం గ్రామవాసి, వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రవి, స్వామి, జాఫర్ పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో ప్రజలకు నొప్పులతో కూడిన జ్వరాలు వస్తున్నందున పీహెచ్‌సీ డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శౌరిక, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించినప్పుడే జీవితంలో మంచి స్థానంలో నిలబడతారని మండల కన్వీనర్ ఎల్లబోయిన కృష్ణవేణి అన్నారు. తుంగతుర్తి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెల్ విజార్డ్స్ డ్రామా అనే అంశాలపై హైస్కూల్ విద్యార్థులకు కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో లింగయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు సురేందర్, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: కుల గణన చేయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు కుంభం సతీష్ హర్షం ప్రకటించారు. మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ కుల గణన చేయనందున పలువురు విద్య, రాజకీయపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కుల గణనతో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వేణురావు, యాకయ్య, సోమయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

● విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని నూతనకల్ మండలం తాళ్లసింగారం సర్పంచ్ చూడి లింగారెడ్డి అన్నారు. ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అప్ గ్రేడ్ షై క్లాస్ రూం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.40వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం తండు వెంకటనారాయణ, బిక్షం, మధుసూదన్రెడ్డి, వెంకటయ్య, దేవరాజు, సంధ్యారాణి, హనుమంతు, వెంకటేష్, రమేష్, అనిత పాల్గొన్నారు.

నాగారం: జంతువులను సంరక్షించి కాపాడవల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎంపీపీ కురం మణివెంకన్న అన్నారు. మండలరలోని ఫణిగిరి గ్రామంలో జంతు సంక్షేమ శాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా చేపట్టిన జంతు పక్షోత్సవాల ర్యాలీలో మాట్లా డారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టు నర్సింహరావు రవిప్రసాద్, పాల్గొన్నారు.

అర్వపల్లి: మండల కేంద్రంలోపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని గుండగాని స్పందన ప్రథమ బహుమతి సాధించింది. ఉపాధ్యాయుడు కృష్ణయ్య బహుమతిగా రూ.1000లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చాంప్లానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.